సాక్షి కామారెడ్డి

సోమవారం ၊ 25 ၊ డిసెంబర్ ၊ 2023



పాఠాలు నేర్వని యంత్రాంగం

ఇటీవల కొత్తబాది ప్రాథమిక పాఠశాల విద్యార్థి కాలువలో పడి చనిపోయినా అధికారులు రక్షణ చర్యలు చేపట్టలేదు.

- 9లో ▸



మహిళల సొమ్ము స్వాహా

మహిళా సంఘాల సభ్యుల సొమ్మును కొందరు సిబ్బంది సొంతానికి వాడుకుంటున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.4 /10.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. శీతల గాలులు వీస్తాయి. రాత్రి పొగ మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ఆనందంగా క్రిస్మస్ జరుపుకోవాలి

కామారెడ్డి క్రైం: క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకాంక్షించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన ద్వారా జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు కరుణామయుడిగా అందరి ఆరాధనలను అందుకుంటున్నారని అన్నారు. ప్రేమ, కరుణ, సహనం, త్యాగం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు బోధించారని పేర్కొన్నారు. ఆయన మార్గాన్ని అనుసరించాలని సూచించారు.

27న ఆటో యూనియన్ సమావేశం



మాచారెడ్డి: ఆటో యూనియన్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఈ నెల 27న కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ అధ్యక్షుడు బోదాసు నర్సింలు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోవాలాల హక్కులు, బాధ్యతలు తదితర సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆటోవాలాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు పావురాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, మండల అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, డైరెక్టర్ కృష్ణ తదితరులున్నారు.

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం నాటికి లక్షా 14 వేల 919 టన్నుల చెరుకు క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్యుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



కామారెడ్డి అర్బన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో అసోసియేషన్‌కు చెందిన డాక్టర్లు శ్రీకాంత్, మక్బూల్‌లు రెండు టీములుగా విడిపోయి స్నేహ పూర్వక మ్యాచ్ ఆడారు. డాక్టర్ శ్రీకాంత్ టీం విన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ, కార్యదర్శి డాక్టర్ అరవింద్, కోశాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సీనియర్, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు. విజేతలకు ట్రోఫీతో పాటు బహుమతులు అందజేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం : జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి అక్షర ఎంపికైంది. ఈ నెల 23న వికారాబాద్ జిల్లా తాండూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్‌లో 68 కేజీల కేటగిరిలో సత్తా చాటి బంగారు పతకం సాధించింది. దీంతో ఈనెల 31న మధ్య ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి చాంపియన్‌షిప్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా నిజామాబాద్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ క్రీడాకారిణిని అభినందించారు.

ముగ్గురూ ముగ్గురే!

- ఎమ్మెల్యేలుగా తొలిసారి ఎన్నిక
- అవగాహనతో అడుగులు
- పాలనలో తమదైన ముద్రకోసం ప్రయత్నం

ఆ ముగ్గురు తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అయినా పాలనలో తమదైన ముద్ర కోసం ప్రయత్నిస్తున్నారు. అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ పెండింగ్ సమస్యలు, నిధుల కొరత, చేయాల్సిన పనుల గురించి చర్చిస్తున్నారు. అవగాహనతో అడుగులు వేస్తూ.. నియోజకవర్గం మీద పట్టు సాధించేందుకు కృషి చేస్తున్నారు.

–సాక్షి, కామారెడ్డి









జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఒక్క బాన్సువాడలోనే సీనియర్ నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన మూడు దశాబ్దాల కాలంలో ఒక్కసారి తప్ప ప్రతి ఎన్నికలో విజయం సాధించారు. మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గానూ పనిచేశారు. అన్ని వ్యవస్థల మీద ఆయనకు అవగాహన ఉంది. కామారెడ్డి నుంచి తొలిసారి విజయం సాధించిన కాటిపల్లి వెంకటరమణారెడ్డికి గతంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఎల్లారెడ్డి నుంచి గెలిచిన కె.మదన్‌మోహన్‌రావుకు ప్రజాప్రతినిధిగా ఇది తొలి అనుభవం. ఆయన గతంలో రెండు పర్యాయాలు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఉన్నత విద్యావంతుడైన మదన్‌మోహన్‌రావు అమెరికాలో సాఫ్ట్‌వేర్ వ్యాపార రంగంలో రాణించారు. పదేళ్లుగా ఇక్కడే ఉంటూ అనేక సేవా కార్యక్రమాల్లో భాగమవుతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆయన వివిధ అంశాలపై 20 నిమిషాలపాటు మాట్లాడారు. నియోజకవర్గ సమస్యలనూ కేస్ స్టడీస్‌గా చూపుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వ పాలనలో లోటుపాట్లను ఎత్తిచూపే ప్రయత్నం చేశారు. జుక్కల్‌లో తోట లక్ష్మీకాంతారావు కూడా తొలిసారి విజయం సాధించారు. ఉన్నత విద్యావంతుడైన లక్ష్మీకాంతారావు గతంలో జర్నలిస్టుగా పనిచేశారు. అలాగే వ్యాపార, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షలు

జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు తొలిసారి విజయం సాధించినప్పటికీ వ్యవస్థల మీద ఉన్న అవగాహనతో ముందుకు సాగుతున్నారు. అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అవినీతి రహిత నియోజకవర్గంగా కామారెడ్డిని తీర్చిదిద్దడానికి సహకరించాలని అధికారులను కోరారు. ప్రభుత్వాలు అందించే సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందేలా, అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేలా చూడాలన్నారు. మున్సిపల్ సమావేశానికి హాజరై పట్టణాభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని కోరారు. అక్రమాలకు తావులేకుండా ముందుకు సాగాలని సూచించారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నియోజకవర్గ కేంద్రంలో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో పాటు జిల్లా అధికారులందరూ హాజరయ్యారు. నియోజకవర్గం అభివృద్ధిలో ముందు స్థానంలో నిలిచేలా కృషి చేయాలని కోరారు.

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సైతం ఇటీవల కలెక్టరేట్‌లో అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు.

అన్ని కార్యక్రమాలలో పాల్గొంటూ..

అసెంబ్లీ సమావేశాలు జరిగిన సమయంలో తప్ప మిగతా రోజుల్లో ముగ్గురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో తరచూ పర్యటిస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాలలోనూ పాల్గొంటున్నారు. అలాగే ఎమ్మెల్యే హోదాలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఫోకస్ చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలకు హాజరవుతూ నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు.



కామారెడ్డిలో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు



సమీక్షిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

రామరాజ్యం రావాలి



జిల్లా కేంద్రంలో అయోధ్య అక్షింతల కలశ ర్యాలీలో పాల్గొన్న భక్తులు

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
- ఘనంగా అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర



ర్యాలీలో చిన్నారులతో ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో రామరాజ్యం రావాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆకాంక్షించారు. శ్రీ రామ జన్మభూమి అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతల కలశాలతో ఆదివారం జిల్లా కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. ధర్మశాల వద్ద ర్యాలీని కామారెడ్డి ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మ రక్షణ కోసం కృషి చేయాలన్నారు. దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని కోరారు. ధర్మశాల నుంచి రైల్వే స్టేషన్, సుభాష్‌రోడ్, గర్ల్స్ హైస్కూల్ రోడ్, కోదూరి హనుమాన్ మందిర్, పెద్ద బజార్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్, జన్మభూమి రోడ్, కొత్త బస్టాండ్ నుంచి శ్రీ సరస్వతి విద్యా మందిర్ వరకు ఈ శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తీర్థ క్షేత్ర సంపర్క అభియాన్ ప్రాంత సంయోజక్ గణపురం రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, గంగారెడ్డి, నిత్యానందం, బొల్లి రాజు, రామలింగారెడ్డి, ధనుంజయ్, వెంకటస్వామి, పాపారావు, వంగ ప్రసాద్, మంచాల రాజు, అనిల్, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, జ్యోతి, రాణి పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా జూపల్లి



సాక్షి, కామారెడ్డి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల పర్యవేక్షణ, సమీక్షలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో జరగనున్నాయి.

ముస్తాబైన చర్చీలు



విద్యుత్ దీపాల అలంకరణలో సీఎస్ఐ వెస్లీ చర్చి



ఏసు జన్మ వృత్తాంతం


కామారెడ్డి టౌన్: క్రిస్మస్ పండుగను సోమవారం క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకోనున్నారు. క్రిస్మస్ నేపథ్యంలో జిల్లాలోని చర్చీలు ముస్తాబయ్యాయి. చర్చీలు విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చీల ఆవరణలో ఏసు జన్మ వృత్తాంతం తెలిపే పశువుల పాకలను ఏర్పాటు చేశారు. ఆదివారం కామారెడ్డిలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో ఏసు చరిత నాటకాన్ని ప్రదర్శించారు.



సీఎస్ఐ చర్చీలో ఏర్పాట్లు

రైతుబంధు రంధీ!

- పూర్తిస్థాయిలో విడుదల కాని పెట్టుబడి సాయం
- ఈ నెల 10న ప్రారంభమైన ప్రక్రియ
- ఇప్పటి వరకు ఎకరంలోపు రైతులకే విడుదల
- తాజాగా రెండెకరాలలోపు రైతుల ఖాతాల్లో జమ
- సకాలంలో సాయం అందక రైతుల తిప్పలు



కామారెడ్డి క్రైం: రైతుబంధు పథకానికి నిధుల కొరతతో బ్రేకులు పడుతున్నాయి. యాసంగి సీజన్ ప్రారంభమై దాదాపు నెలన్నర గడుస్తున్నా పెట్టుబడి సాయం ఇంకా అందలేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 10 నుంచి రైతుబంధు నిధులు విడుదల చేస్తున్నారు. జిల్లాకు మొత్తం రూ.267 కోట్లు అవసరం ఉండగా ఇప్పటివరకు ఒక ఎకరంలోపు భూమి ఉన్న రైతులకు రూ.21.68 కోట్లు మాత్రమే జమ అయ్యాయి. మిగతా రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 3,16,087 మంది రైతులు

పంటల సాగులో రైతులకు ఆర్థికంగా చేయూతను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2018లో రైతు బంధు పథకాన్ని తీసుకువచ్చింది. మొదట్లో ఎకరానికి రూ.4 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించేవారు. ఏడాది తర్వాత పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం రూ.5 వేలకు పెంచింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి యేడాదికి రూ.15 వేల చొప్పున రైతుబంధు ఇస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు జరిగి వారం రోజులే కావడం, నూతన మార్గదర్శకాలను రూపొందించడం ఆలస్యం అవుతుండటంతో ప్రస్తుతానికి పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా గత ఖరీఫ్ సీజన్‌లో 2.79 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందింది. రూ.264.39 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుల సంఖ్య పెరిగింది. గత సీజన్‌తో పోలిస్తే జిల్లాలో 30 వేలకు పైగా కొత్త రైతులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2,480 మంది రైతులు చనిపోగా వారి ఖాతాలను నిలిపివేశారు. మొత్తం మీద ఈ సారి 3,16,087 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇందుకు రూ.267.02 కోట్ల నిధులు అవసరం. విస్తీర్ణం ప్రకారం తక్కువ నుంచి ఎక్కువ భూమి కలిగిన రైతులకు సాయం అందంచడం ఆనవాయితీ. ఇప్పటివరకు కేవలం ఎకరం భూమి కలిగిన రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందింది.

పెట్టుబడికి అప్పులు

ప్రతి వానాకాలం, యాసంగి సీజన్లలో ఈ పథకం ద్వారా ప్రభుత్వం రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధులను జమ చేస్తుంది. ఇప్పటికే 2023–24 యాసంగి సీజన్ ప్రారంభమై నెల దాటింది. ఎకరంలోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో రైతుబంధు జమ చేశారు. తాజాగా రెండు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు జమ చేయడం ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా వరి, ఆ తర్వాత శనగ, మొక్కజొన్న, సోయాబిన్ పంటలు సాగు చేస్తున్నారు. రైతుబంధు రాకపోవడంతో ఎరువులు, విత్తనాలు, ఇతర పెట్టుబడులకు రైతులు అప్పులు చేస్తున్నారు.

అందరికీ అందేలా చూస్తాం



ప్రస్తుత యాసంగి సీజన్‌కు పాత పద్ధతిలోనే రైతుబంధు అమలు జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల జరిగిన ప్రకారం రైతుల అకౌంట్లలో డబ్బులు జమ అవుతున్నాయి. ప్రక్రియ నెమ్మదిగా జరుగుతున్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికి రైతుబంధు అందేలా చూస్తాం.

– భాగ్యలక్ష్మి, డీఏవో, కామారెడ్డి

28 నుంచి ప్రజాపాలన గ్రామసభలు

- ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో దిశానిర్దేశం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



సీఎంతో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ

సాక్షి, కామారెడ్డి: పాలనను ప్రజల చెంతకు తీసుకువెళ్లడంతో పాటు ప్రజల నుంచి ఆరు పథకాలకు దరఖాస్తులను స్వీకరించేందుకు ఈనెల 28 నుంచి వచ్చే నెల 6 వరకు ప్రజా పాలన పేరుతో గ్రామ/వార్డు సభలు నిర్వహించనున్నారు. ఆదివారం రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఎస్పీ సింధుశర్మ పాల్గొన్నారు. సీఎం ఆదేశాల మేరకు గ్రామ సభల కోసం తహసీల్దార్, ఎంపీడీవోల ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో బృందం రోజూ రెండు గ్రామసభలలో పాల్గొని ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఒక గ్రామంలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో గ్రామంలో సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వం ఆయా పథకాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాల నమూనాలను రూపొందించి పంపిస్తుంది. దరఖాస్తుదారులు ముందుగానే తీసుకుని వివరాలను నమోదు చేసి సభలో అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

నిజాంషుగర్స్ చరిత్రలో లేఆఫ్ బ్లాక్ డే



ఎన్డీఎస్ఎల్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

బోధన్: నిజాంషుగర్స్ చరిత్రలో ఫ్యాక్టరీ లేఆఫ్ బ్లాక్‌డే అని కార్మిక నాయకుడు నాగేశ్వర్‌రావు అన్నా రు. ఎన్డీఎస్ఎల్ ప్రైవేట్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీ ప్రధాన గేటు వద్ద కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నా యకులు, కార్మికులు మాట్లాడుతూ.. లేఆఫ్ ఎత్తివేసి, బకాయి వేతనాలు ఇప్పించి తమకు న్యాయం చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి అనేకసార్లు మొర పెట్టుకున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆర్థిక, అనారోగ్య సమస్యలతో 33 మంది కార్మికులు తనువు చాలించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజాంషుగర్స్‌కు మంచి రోజులు వస్తాయనే ఆశతో ఉన్నామని పేర్కొన్నారు. బోధన్ ప్రస్తుత ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తమకు బకాయి వేతనాలు ఇప్పిస్తామని, చెరుకు రైతులతో మాట్లాడి ఫ్యాక్టరీని నడిపిస్తామని హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గంగోత్రి జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని గంగోత్రిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 16 నుంచి 18 వరకు కామారెడ్డిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో మధ్యప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ సురేందర్, ఉప స్పంచ్ రాజారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బాలబాలికల జట్లు..



నిజామాబాద్‌నాగారం: నగరంలోని అభ్యాస స్కూల్‌లో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు బాలబాలికల జట్లను జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్ రావు, రమేశ్ ఆదివారం ఎంపిక చేశారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, సృజన్‌రెడ్డి, కోశాధికారి గంగాధర్, నిర్వహణ కార్యదర్శి మహేశ్, సభ్యులు సునీల్, రమేశ్, నాగరాజు, అనిల్, సాగర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు..



రాజంపేట: రాష్ట్ర స్థాయి అండర్–14 బాలికల కబడ్డీ పోటీలకు తలమడ్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అనూష ఎంపికై నట్లు హెచ్ఎం దొమ్మట భిక్షపతి ఆదివారం తెలిపారు. జనగామ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో అనూష పాల్గొంటుందని అన్నారు. అనంతరం విద్యార్థిని అనూషను సర్పంచ్ యాదవరెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ టీచర్ అరుణ, ఎంపీటీసీ రాజు, ఎస్ఎంసీ చైర్మన్ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ధర్మారం విద్యార్థులు



నిజామాబాద్ రూరల్: రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థినులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు.

ఆర్మూర్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థినులు సన్నిధి, బృందా రాష్ట్ర స్థాయి పోటీలకు ,ఎంపికైనట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులను పీఈటీ జ్యోత్స్న, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాస్తు చేసుకోవాలి

బాన్సువాడ రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం కోసం జనవరి 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బోర్లం గురుకుల ప్రిన్సిపాల్ పద్మకుమారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 2023–24లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష ఉంటుందని అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మహిళా సంఘాల సొమ్ము స్వాహా..?



బొమ్మన్‌దేవ్‌పల్లిలో విచారిస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

- లెక్కల్లో తేడా కనిపిస్తున్నా సిబ్బందిని వెనకేసుకొస్తున్న ఉన్నతాధికారులు
- మహిళా సంఘాల సభ్యులతో అధికారుల మంతనాలు
- న్యాయం చేయాలంటున్న బాధితులు

నస్రుల్లాబాద్: గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను స్థాపించింది. వీటిలో పది మంది సభ్యులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వారికి బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి ప్రతి నెలా కొంత మొత్తం పొదుపు చేయించి తద్వారా ఆయా బ్యాంకుల నుంచి రుణాలు కల్పించి వారిచే చిరు వ్యాపారాలు, చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయించి ఆర్థిక భరోసా కల్పించాలనేది సంఘాల ముఖ్య ఉద్దేశం. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. పేద మహిళలు కూలి.. నాలి చేసుకొని కష్టపడి సంపాదించిన సొమ్మును కొందరు సిబ్బంది గద్దల్లా తన్నుకుపోతున్నారు. సిబ్బంది అవినీతికి పాల్పడినా సంబంధిత అధికారులు మాత్రం వారికే వత్తాసు పలుకుతుండడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో 42,160 సంఘాలు..

కామారెడ్డి జిల్లాలో 18,083 స్వయం సహాయక సంఘాలు ఉండగా 1,81,250 మంది సభ్యులున్నారు. నిజామాబాద్ జిల్లాలో 24,077 సంఘాలు ఉండగా 2,40,522 మంది సభ్యులు ఉన్నారు. వీరిని సమన్వయ పర్చేందుకు ప్రతి మండలానికి ఐకేపీ ఏపీఎంను నియమిస్తారు. ఏపీఎం కింద సీసీలు, సీఏలు ఉంటారు.

25 మహిళా సంఘాలకు గ్రామ సంఘం..

ప్రతి గ్రామంలో పది మంది సభ్యులతో ఒక మహిళా సంఘం, 25 మహిళా సంఘాలకు ఒక గ్రామ సంఘం, గ్రామ సంఘాలన్నింటిని కలిపి ఒక మండల సమాఖ్యను ఏర్పాటు చేసి కమిటీ ఏర్పాటు చేస్తారు. వారికి ఒక అధికారిని నియమిస్తారు. ఆ అధికారి సంఘాల బలోపేతం, సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుంది. కానీ విధి నిర్వహణలో వారి నిర్లక్ష్యంతో సంఘ సభ్యులు బలవుతున్నారు. దీనిలో భాగంగానే గతంలో మాచారెడ్డి మండలంలో, ఉమ్మడి బీర్కూర్ మండలంలోని బీర్కూర్‌లో పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. గత మూడేళ్లగా బొమ్మన్‌దేవ్‌పల్లిలో ఐకేపీ లెక్కల్లో ఓవర్ డ్యూగా చూపిస్తున్న సుమారు రూ.6లక్షలు కూడా అందులో భాగమనే చెప్పుకోవాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీంతో పాటు మండలంలోని నెమ్లి గ్రామంలో సైతం మహిళల డబ్బులు గోల్ మాల్ అయినట్లు సమాచారం.

బొమ్మన్‌దేవ్‌పల్లిలో డబ్బులేమయ్యాయి..

నస్రుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో రెండు గ్రామ సంఘాలు ఉన్నాయి. అందులో 46 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటిని సమన్వయ పరిచేందుకు సంఘానికి ఒక్కరు చొప్పున ఇద్దరు వీవోఏలు ఉన్నారు. అయితే ఓ గ్రామ సంఘంలోని మహిళా సంఘానికి చెందిన అధ్యక్షురాలు రూ.85 వేలు సంఘ సభ్యులకు తెలియకుండా వాడుకున్నారు. దీంతో పాటు గ్రామ సంఘానికి రూ.30లక్షల వరకు స్త్రీ నిధి అప్పులు ఇవ్వగా సంఘం సభ్యులు ప్రతి నెలా చెల్లిస్తున్నా అవి మాత్రం ఓవర్ డ్యూగా కనబడుతున్నాయి. వీటి లెక్కలను సభ్యులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సదరు గ్రామ స్థాయి సిబ్బందిని వెనకేసుకుంటూ విషయాన్ని బయటకు పొక్కనివ్వడం లేదు. గత వారం నుంచి గ్రామంలో పంచాయతీలు పెడుతున్నా అవి బయటకు పొక్కకుండా అధికారులు కాపాడుతున్నారు. గతంలో చేసిన లెక్కలు అప్పగించక ముందే మళ్లీ అక్రమాలు వెలికి వస్తున్నాయి. దీంతో ప్రతి మహిళా సంఘం సభ్యులతో మంతనాలు జరుపుతూ విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

విచారణ చేపడుతున్నాం

బొమ్మన్‌దేవ్‌పల్లిలో మహిళా సంఘం డబ్బులు గోల్ మాల్ జరిగిందని, లెక్కల్లో పొరపాట్లు ఉన్నాయన్న అనుమానంతో విచారణ చేపడుతున్నాం. పూర్తి వివరాలను త్వరలో ప్రజల ముందుకు తీసుకువస్తాం. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.

–గంగాధర్, ఏపీఎం, నస్రుల్లాబాద్

వైద్య సేవలు మెరుగుపడేనా..!



మోర్తాడ్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్

మోర్తాడ్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో కొనసాగుతున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లను వైద్య విధాన పరిషత్ పరిధిలోకి మారుస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అధికారులు సైతం సీహెచ్‌సీలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోకి సీహెచ్‌సీలు మారినా వైద్య సేవలు మెరుగుపడతాయనే సంశయం వ్యక్తమవుతోంది. వైద్య నిపుణులు పూర్తి సంఖ్యలో లేక పోవడం, అవసరమైన సిబ్బంది నియామకాలు జరుగకపోవడంతో సీహెచ్‌సీలలో వైద్య సేవలు నామమాత్రంగానే అందాయి. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను 13 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సీహెచ్‌సీలను ఏర్పాటు చేసి 30 పడకలు ఉండేలా సామర్థ్యం పెంచారు. మోర్తాడ్, బాల్కొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, కోటగిరి, వర్ని, నవీపేట్, ఆర్మూర్‌లలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు అయ్యాయి.

అన్ని రకాల వైద్య సేవలు

పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు, గర్భిణులకు సాధారణ ప్రసవాలు, గర్భిణులు, చిన్నారులకు టీకాల కార్యక్రమం, శిబిరాలు నిర్వహించిన సమయంలో కు.ని ఆపరేషన్‌లు చేయడం జరుగుతుంది. కరోనా విజృంభనతో పీహెచ్‌సీలలో నిర్ధారణ పరీక్షలతో పాటు, వ్యాక్సినేషన్‌ను కొనసాగిస్తున్నారు. సీహెచ్‌సీల్లో మాత్రం అన్ని రకాల వైద్య సేవలను అందించాలని ఉమ్మడి రాష్ట్రంలోనే అప్పటి ప్రభుత్వాలు నిర్ణయించాయి. గర్భిణులకు అవసరమైన స్కానింగ్ నిర్వహించడం, శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవాలు, చిన్న చిన్న ఆపరేషన్‌లు చేసి పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం లేకుండా చేయడం ప్రధాన ఉద్దేశంగా సీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే స్త్రీ వైద్య నిపుణులు, మత్తు వైద్యుడు, దంత, రేడియాలజీ, సర్జన్, జనరల్ మెడిసన్ ఇలా అనేక రకాల వైద్య సేవలను అందించడానికి స్పెషలిస్టులను నియమించాలని భావించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో వైద్య సేవలను విస్తృతపరచడానికి మన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కేరళలో అధ్యాయనం చేశారు. కానీ తరువాతి కాలంలో సీహెచ్‌సీలలో సాధారణ వైద్య సేవలనే అందించారు. కొన్ని సందర్భాలలో శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవలను చేశారు. చివరకు స్త్రీ వైద్య నిపుణులు, మత్తు వైద్యులు లేరనే కారణంగా సీహెచ్‌సీలలో ప్రసవాలను నిలపివేశారు.

ప్రత్యేక నియామకాలు చేపడితేనే..

వైద్య విధాన పరిషత్ పరిధిలోకి సీహెచ్‌సీలను విలీనం చేసిన నేపథ్యంలో ఈ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందించాలంటే ప్రత్యేకంగా వివిధ రకాలైన వైద్య నిపుణులు, సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇది వరకు కొనసాగుతున్న వైద్యులు, సిబ్బంది పూర్తిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని వారే ఉన్నారు. వైద్య విధాన పరిషత్ విభాగం వేరు కావడంతో ప్రత్యేకంగా నియామకాలు అనివార్యం కానున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో వైద్యులు, సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండటంతో సీహెచ్‌సీలలో కొనసాగుతున్న వారు పీహెచ్‌సీలకు సర్దుబాటు చేసే అవకాశం ఉంది. ఇది ఇలా ఉండగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వైద్య విధాన పరిషత్‌లోకి మార్చినా పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది నియామకం జరుగకపోవడంతో రోగులకు మెరుగైన వైద్యం అందలేదు. గత ప్రభుత్వం విలీనంపై పెట్టిన దృష్టిని సౌకర్యాలను మెరుగుపరచడంపై ఆసక్తిని కనబర్చలేదు. ఫలితంగా వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వైద్య విధాన పరిషత్‌లో విలీనమైన ఆస్పత్రుల్లో వైద్య సేవలు మెరుగుపర్చాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

మంచి పనులతో మరింత పేరు సాధించాలి



మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త మధు

సాక్షి, కామారెడ్డి : జుక్కల్ ప్రజల ఆదరాభిమానాలతో ఎమ్మెల్యేగా విజయం సాధించిన తోట లక్ష్మీకాంతారావు సరికొత్త రికార్డు నెలకొల్పారని సామాజిక కార్యకర్త మేడ మధుసూదన్ అన్నారు. జుక్కల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన లక్ష్మీకాంతారావును హైదరాబాద్‌లోని హైదర్ షాకోట్ మోపిల్ టౌన్‌షిప్ వాసులు శనివారం రాత్రి సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సన్మాన సభలో మధుసూదన్ మాట్లాడుతూ.. స్వయం కృషితో ఉన్నత స్థాయికి ఎదిగిన లక్ష్మీకాంతారావు సేవా కార్యక్రమాల ద్వారా అనతి కాలంలోనే జుక్కల్ ప్రజలకు దగ్గరయ్యారన్నారు. భారత్ జోడో యాత్రలో తలుక్కుమన్న లక్ష్మీకాంతారావు ప్రజలకు ఆపదలో అండగా నిలిచి, ఉద్దండులను ఓడించాడని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. జుక్కల్ నియోజక వర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో భాగమవుతానన్నారు. సభలో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్, పలువురు ప్రముఖులు పెంటారెడ్డి, రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి డీసీపీ పరామర్శ



ఖలీల్‌వాడి: నగరంలో ఐదో టౌన్ పీఎస్‌లో గుండెపోటుతో ఆదివారం మృతి చెందిన కోటి రామాంజనేయరెడ్డి కుటుంబ సభ్యులను డీసీపీ జయరాంరెడ్డి పరామర్శించారు. అనంతరం పోలీస్‌శాఖ తరపున రూ.20 నగదును కానిస్టేబుల్ భార్యకు అందజేశారు.పరామర్శించిన వారిలో ఏసీపీ కిరణ్‌కుమార్, టౌన్ సీఐ నరహరి,నార్త్ సీఐ సతీశ్, సిబ్బంది ఉన్నారు.

రోటరీ రైలా ప్రారంభం



రోటరీ రైలా కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు, విద్యార్థులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ అకాడమీలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ జిల్లా 3150 ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించే రైలా(రోటరీ యూత్ లీడర్ షిప్ అవార్డులు–2023) కార్యక్రమాన్ని రోటరీ మాజీ గవర్నర్ సీఏ సురేశ్ ఆదివారం ప్రారంభించారు.ఆదివారం కొలబరేషన్ కోచ్ ప్రముఖ మెజీషియన్ వివిధ అంశాలపై విద్యార్థులకు సెమినార్లు నిర్వహించారు. సోమవారం అలీసాగర్‌లో సాహస క్రీడలను తెలంగాణ అడ్వెంచర్స్ సొసైటీ కుల్ల రంగారావు ఆధ్వర్యంలో జరగనుందని, 26న ఫిలిం ఎగ్జిబిటర్, సామాజిక కార్యకర్త అంశాలపై సెమినార్లు నిర్వహించి ముగింపు సమావేశం ఉంటుందని క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. రైలా కార్యక్రమం అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, సామాజిక అంశాలు, ఉన్నతమైన లక్ష్యంపై సెమినార్లు నిర్వహించి వారికి తగిన శిక్షణ ఇవ్వటమే రైలా ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా రైలా చైర్మన్ జితేంద్ర మాలని, ప్రముఖ మెజీషియన్ రోటరీ మాజీ అధ్యక్షుడు సామల వేణు, ప్రముఖ కోలాబరేషన్ కోచ్ కేఎస్ శర్మ, యూఎస్ఏ ప్రతినిధి రాజేందర్, రోటరీ కార్యదర్శి ప్రసన్నకుమారి, కోశాధికారి ఇందూరి శ్రీనివాస్, డాక్టర్ మారయ్య గౌడ్, ఆకుల అశోక్, ధీరజ్ రెడ్డి, ఎస్ఎస్ఆర్ ప్రిన్సిపాల్ భాస్కర్, జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శబరి మాత జన్మదిన వేడుకలు



తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శబరి మాత జన్మదిన వేడుకలను ఆశ్రమ నిర్వాహకులు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శబరి మాత ప్రతిమ, దివ్యసమాధిలను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేపట్టారు. అర్ధరాత్రి వరకు భజనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలోని వినాయక్‌నగర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుడిపల్లి నాగిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా మూల జగన్‌రెడ్డి, కోశాధికారిగా ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గాధారి సంజీవ్‌రెడ్డి, కర్క గంగారెడ్డి, సాయిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఉల్లెంగ గంగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జితేందర్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఒంటెల గంగారెడ్డి, కె గంగారెడ్డి, అరికెల శ్రీకాంత్‌రెడ్డి, బేతి రవికుమార్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, సలహాదారులుగా విజయేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చెన్నారెడ్డి, న్యాయ సలహాదారులుగా నల్ల సుభాష్‌రెడ్డి, ఈసీ సభ్యులుగా అన్నం సతీశ్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సవీన్‌రెడ్డి, నారాయణరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శేఖర్ వ్యవహరించారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి జిల్లాకేంద్రంలో స్థిరపడ్డ 129 మోటాటి రెడ్డి కుటుంబాలతో సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

బాల్కొండ: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ భర్త ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్సై శంకర్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పోచమ్మ గల్లీకి చెందిన తూం నడ్పి పోశెట్టి(42)కి పెర్కిట్ చెందిన లతతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. మూడేళ్ల క్రితం వీరి మధ్య గొడవ జరగడంతో లత పుట్టింటికి వెళ్లిపోయింది. నాటి నుంచి ఇంటికి రావాలని పోశెట్టి కోరినా లత రాకపోవడంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న పెద్ద పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

కళాశాలలకు ప్రహరీలేవీ?



తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల



ప్రహరీ లేని దృశ్యం

- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తాడ్వాయి: జిల్లాలోని 18 ప్రభుత్వ కళాశాలలకు ప్రహరీ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు 20 ఉండగా అందులో బాన్సువాడ, బిచ్కుంద కళాశాలలు మినహా 18 కళాశాలలకు ప్రహరీలు లేవు. గ్రామాల్లో పదో తరగతి విద్యనభ్యసించే పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేసింది. కానీ అందులో ప్రహరీలు, మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరిపడా గదులు, ప్రహరీ, సరైన వసతులు కరువయ్యాయి.

గతంలో కళాశాలలో మూడు గదులే నిర్మించడంతో ఇబ్బందులు పడ్డారు. స్పందించిన గత ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంతో కళాశాల పైన మరో నాలుగు అదనపు గదులను నిర్మించింది. కానీ ప్రహరీని మాత్రం నిర్మించలేదు. ఫలితంగా కళాశాలలో నాటిన హరితహారం మొక్కలు పశువులు మేస్తున్నాయి. అంతేకాకుండా తాగునీటి కోసం వేసిన బోరు పనిచేయకపోవడంతో విద్యార్థులు దుకాణాల నుంచి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ కోర్సులు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు అనుగుణంగా మరిన్ని గదులు నిర్మించాల్సి ఉంది. ఇరుకు గదుల్లోనే విద్యార్థులు పాఠాలు వింటున్నారు. ప్రాక్టికల్స్ కోసం ప్రత్యేక గదులు సైతం లేవు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ప్రధాన రహదారి నుంచి కళాశాల వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉండంతో వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారులు పట్టించుకోవాలి



కళాశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని సమస్యలను పరిష్కరించాలి. కనీసం వచ్చే విద్యాసంవత్సరం వరకై నా కళాశాలలో అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయాలి. ప్రాక్టికల్ కోసం ప్రత్యేక తరగతులను నిర్మించాలి.

– హర్షవర్ధన్, విద్యార్థి

ప్రతిపాదనలు పంపించాం



కళాశాలలో ప్రహరీ, అదనపు గదులు, రోడ్డు, తాగునీరు, మరుగుదొడ్లు, మౌలిక వసతుల కోసం రాష్ట్ర అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. కళాశాల సమస్యలను ప్రజాప్రతినిధులకు సైతం వివరించాం. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతిపాదనల ప్రకారం తగు చర్యలు తీసుకుంటాం.

– సయ్యద్ యూసుఫ్, ప్రిన్సిపాల్

క్రైం కార్నర్

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కోటి రామాంజనేయరెడ్డి (44) గుండెపోటుతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. పీఎస్‌లో ఉదయం రూల్‌కాల్ నిర్వహించిన తర్వాత రామాంజనేయరెడ్డికి గుండెపోటు రావడంతో గమనించిన సహచర పోలీసులు జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

లింగంపేట: మండల కేంద్రంలో శనివారం రాత్రి పేకాట స్థావరంపై దాడి నిర్వహించినట్లు ఎస్సై ప్రభాకర్ ఆదివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. లక్షా ఎనిమిది వేలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఎవరైనా పేకాట ఆడితే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.